ప్రజాశక్తి

ఆదివారం 20 ఏప్రిల్ 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

పశు వైద్యానికి సుస్తీ..

- నిలిచిపోయిన సంచార వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న పశు పోషకులు



ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గత వైసిపి ప్రభుత్వం 2022 మే 19న సంచార పశు వైద్య వాహనాలకు శ్రీకారం చుట్టింది. ఆ వాహనాల ద్వారా పశువులకు ఇంటి వద్ద మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సంచార పశు వైద్య సేవలు ప్రారంభించారు. ఆ వాహనంలో డాక్టర్, హెల్త్ అసిస్టెంట్, డ్రైవర్ ఉంటారు. పశువులకు సంబంధించిన అన్ని మందులు ఉంటాయి. ఒక్కో నియోజకవర్గానికి రెండు సంచార వైద్య సేవల వాహనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సేవల కోసం 1962 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారు. అనతికాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రైతు ముంగిట ఈ సేవలు మంచి గుర్తింపు పొందాయి. ఫోన్ చేస్తే 20 నిమిషాల్లోపు వాహనం రావడంతో మెరుగైన వైద్య సేవలు సాధ్యమయ్యేవి. పస్తుతం సంచార వైద్యానికి గ్రహణం పట్టుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంచార పశు వైద్య వాహనాల గురించి పట్టించుకోవడం లేదు. గత నెల నుంచి జిల్లాలోని 17 సంచార పశు వైద్యశాలలకు గాను సంబంధించి ఎనిమిది వాహనాలకు కాంట్రాక్టు గడువు ముగియడంతో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు వీటిని నిలిపివేశారు. ప్రస్తుతం తొమ్మిది వాహనాలు మాత్రమే సేవలందిస్తున్నాయి. దీంతో సకాలంలో పశువులకు వైద్యం అందక పశు పోషకులు ఆందోళన చెందుతున్నారు.

కాంట్రాక్టు గడువు ముగిసినా..

ఉన్నతాశయంతో గత వైసిపి ప్రభుత్వం పశు సంచార వాహనాలకు శ్రీకారం చుట్టింది. గడువు ముగియడంతో వాటిని పక్కన పెట్టేశారు. కూటమి ప్రభుత్వం కాంట్రాక్టు ముగిసినా పట్టించుకోకుండా ముందుకు వెళుతుండడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. గ్రామీణ ప్రాంత పశువులకు, ఇతర జంతువలకు ▶ 2లో

కూటమి నేతలకూ మద్యం దెబ్బ ఖాయం

- అపుడు నాసిరకం..
- ఇపుడు ఊరూరా మద్యం
- టార్గెట్లు పెట్టి దుకాణాలకు సరుకు డంపు



ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

వైసిపి ప్రభుత్వానికి నాసిరకం మద్యం దెబ్బ తగిలింది. ఆ ప్రభుత్వం నేరుగా దుకాణాలు పెట్టి అమ్మిన మద్యం తాగి చాలా మంది ఆరోగ్యాలు పాడయ్యాయి. ఎంత తాగినా కిక్కులేదని బహిరంగంగానే దూషించారు. దాని ఫలితంగా మద్యం తాగిన పేదలు ఎక్కువ శాతం ఓటేయలేదని వైసిపి అభ్యర్థులు ఇప్పటికీ సందర్భం వచ్చినపుడల్లా గుర్తు చేసుకుంటున్నారు. ఇపుడు మద్యం సెగలు కూటమి ప్రభుత్వానికి తప్పవా?అనే సందేహాలు వస్తున్నాయి. వాస్తవం కూడా. ఎందుకంటే ఇపుడు గ్రామాల్లోకి ఏదో రకంగా మద్యం డంపు అవుతోంది. మంచినీళ్ల కన్నా మద్యమే సులువుగా దొరుకుతుంది. మహిళల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. నాణ్యమైన మద్యం పేరుతో కొత్తప్రచారం ముందుకు తెచ్చారు. మహిళల్లో మద్యంపై ఉన్న వ్యతిరేకతను గుర్తించడంలేదు. ఇప్పటికే ఊరూరా బెల్టు దుకాణాలు వెలిశాయి. ఊరికి పదుల సంఖ్యలో పెట్టారు. వీటిని ఉపాధికోసం కొందరు ఎంచుకున్నారు. పాలక పక్షనేతలు, పోలీసుల సహకారంలోనే ఇవి నడుస్తున్నాయి. ఎవరంటే వాళ్ల పెట్టుకోవడానికి వీల్లేదు.పైగా వేలం నిర్వహించారు. గుడుల అభివృద్ధి, గ్రామాల్లో ఇతర అవసరాల కోసం ఉమ్మడి సొమ్ముగా దీన్ని పెడుతున్నారు. బెల్టు దుకాణాన్ని రూ.5 నుంచి రూ.10లక్షల వరకూ వేలంలో పాడుకుంటున్నారు. మద్యం అమ్ముకుంటున్నారు. చాలా గ్రామాల్లో ఇవి వివాదాలకు కారణంగా మారాయి. గతంలో పత్తి,మిర్చి అమ్మకాల నుంచి వసూలు చేసిన సొమ్ము విషయంలోనే అనేక చోట్ల గొడవలు జరిగాయి. హత్యలకు దారితీశాయి.ఫ్యాక్షన్ గొడవలూ పెరిగాయి. ఇలాంటి వేలం పాటల ద్వారా వచ్చిన ▶ 2లో

మార్టూరులో కలకలం ..

వైసిపి నేత ఫ్యాక్టరీలో

భారీగా పేలుడు సామగ్రి లభ్యం ▶ 8లో

ఒక్కో ఊరికి ఒక్కో న్యాయం!

ఇదీ పెద్దారవీడు పోలీసుల వ్యవహారం!

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు పోలీసులు వ్యవహారశైలి విమర్శలకు తావిస్తోంది. ఒక్కో ఊరికి ఒక్కో న్యాయం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పోలీస్ చెప్పిందే శాసనమన్నట్లుగా వ్యవస్థ నడుస్తోంది. ఓ విధంగా చెప్పాలంటే తిరునాళ్లలో పోలీస్ రాజ్యమే ఏలుతోంది. ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయితీలను కూడా పక్కన పెట్టాల్సి వస్తోంది.!

పెద్దారవీడులో ఉరుసు ఉత్సవాలు ఈ నెల 12, 13, 14వ తేదీల్లో జరిగాయి. వేడుకల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. పెద్దారవీడు ఉరుసు ఉత్స వానికి తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. కుల, మతాలకు అతీతంగా శ్రీనా గులమీరా స్వామి ఉత్సవం జరుపు కుంటారు. ఈ పండుగ ఒక్కటే పెద్దారవీడు వాసులకు ముఖ్యమైనది. రాజకీయ పార్టీల పరంగా పాట కచేరీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సాంఘిక నాటకాలు, పౌరాణిక నాటకాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా అదే విధంగా ఐదు పాట కచేరీలు ఏర్పాటు చేశారు. పోలీసుల అనుమతి కోరిన తరువాత సరే అన్నందునే పాట కచేరీలకు అడ్వాన్సు పైకం చెల్లించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు కొంతమేర పోలీసులకు అడిగినంత కాకపోయినా కొంతమేర పైకం ఇచ్చేందుకు అంగీకరించారు. పోలీసులకూ కొంత నగదు ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. అడిగినంత మేర ఇవ్వలేదనో.. కారణం ఇంకేమైనా కావచ్చు కానీ... అంతా సిద్ధమైన తరువాత సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతి ఇవ్వడం లేదని చెప్పడం జరిగింది. ఈ లోగా జరిగే నష్టం జరిగిపోయింది. ఒక్కసారిగా ఉరుసు ఉత్సవం ఉసూరుమంది. ఉరుసు ఉత్సవాలపై పోలీసుల ఆంక్షలేమిటని ప్రజలంతా ప్రశ్నల వర్షం కురిపించారు. ఎప్పుడైనా ఉరుసు వేడుక ప్రశాంతంగా జరిగేది. అలాంటి వేడుకలో అల్లర్లు జరుగుతాయని పోలీసులు కుంటి సాకులతో కార్యక్రమాలను నిలుపుదల చేయడం విమర్శలకు తావిచ్చింది.

కేసులకు భయపడను

ఇదే మండంలోని మాచరాజుకుంటలో శుక్రవారం రాత్రి నాగులమీరా స్వామి ఉరుసు వేడుక జరిగింది. ఇక్కడ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రభను ఏర్పాటు చేశారు. పాట కచేరీ పేరుతో డ్యాన్స్‌లు జోరు కొనసాగింది. ఈ కార్యక్రమానికి పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేయడం గమనార్హం. పెద్దార వీడులో ఇవ్వని అనుమతి... మాచరాజుకుంటలో ఎలా ఇచ్చారని, ఇందులో ఏదో మతలబు ఉందనేది ప్రజల వాదన. పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టినట్లు ప్రచారంలో ఉంది. పోలీసుల వ్యవహారం అందరికీ ఒకేలా ఉండాలే కానీ... ఊరికో విధంగా అన్నట్లు వ్యవహరించడం, ప్రజల మనోభావాలు దెబ్బతీయడం తప్పు మరొకటి కాదని ప్రజలు పేర్కొంటున్నారు.

పశువైద్యానికి సుస్తీ

(మొదటిపేజీతరువాయి)

ఉపయోగపడే ఈ పథకంపై ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడంపై పాడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంచార పశు వైద్య వాహనాల కాంట్రాక్టు పొడిగించడంపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందో అంతుచిక్కుడం లేదని పలువురు పశువుల యజమానులు ప్రశ్నిస్తున్నారు.

అమలు అంతంతమాత్రమే..

అత్యవసర పశు వైద్యసేవలకు ఉపయోగపడే మొబైల్ వాహన అంబులెన్సులో వైద్యుడు, పారావెట్, అటెండర్ కమ్ డ్రైవర్ ఉంటారు. 1962 నంబరుకు ఫోన్ చేస్తే వెంటనే వాహనం నిర్దేశిత ప్రాంతానికి వస్తుంది. పశువుకు హిస్టరెక్టమీ సహా పలు శస్త్రచికిత్సలు, 20 రకాల పేడ పరీక్షలు, 15 రకాల రక్త పరీక్షలు చేసేందుకు వీలుగా 54 రకాల పరికరాలు, మినీ ఫ్రిజ్ ఈ వాహనంలో ఉంటాయి. ప్రతి అంబులెన్సులో మొత్తం రూ.35 వేల విలువైన ఎనిమిది రకాల మందులను అందుబాటులో ఉంచాలి. కదలలేని స్థితిలో ఉన్న పశువులను హైడ్రాలిక్ సాయంతో వాహనంలోకి ఎక్కించి, దగ్గరలోని ఆసుపత్రిలో చికిత్స ఇప్పించి, తిరిగి రైతు ఇంటివద్ద దింపి వెళ్లడం ఈ అంబులెన్సు సేవల ప్రత్యేకత.

పాడి రైతుల అవస్థలు..

సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలు నెల రోజులకు పైగా నిలిచిపోయాయి. దీంతో పశువులకు ఏదైనా అత్యవసర వైద్యం చేయాల్సి వస్తే ఇబ్బందిగా మారిందని పశు పోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య సేవల కోసం పశు వైద్యశాలల చుట్టూ తిరిగేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ప్రజాప్రతి నిధులు, ఉన్నతాధికారులు స్పందించి సంచార పశు ఆరోగ్య సేవ వాహన సేవలను అందుబాటులోకి తీసుకు రావాలని వారు కోరుతున్నారు.

పశువులకు వ్యాధులు వస్తే ఇబ్బందిపడుతున్నాం

రామావత్ బాలు నాయక్, పశు పోషకుడు, మిల్లంపల్లి

పశువులకు వ్యాధులు రావడంతో ఇబ్బందులు పడుతున్నాం. వాటిని దూర ప్రాంతంలో ఉన్న పశు వైద్యశాలకు తీసుకెళ్లలేక నాటు వైద్యాలను, ప్రైవేటు వైద్యులను ఆశ్రయించి డబ్బులు పోగొట్టుకుం టున్నాం. ఒక్కోసారి పశువులే మృత్యువాత పడుతున్నాయి. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం.

వాహనాలను పునరుద్ధరించాలి

తిరుపతి నాయక్, పశు పోషకుడు, మూలమడుగు తండా

నోరులేని మూగజీవాల పట్ల కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు కనికరం చూపాలి. నిలిచిపోయిన ఎనిమిది సంచార పశు వైద్య వాహనాలను తిరిగి పునరుద్ధరించాలి. పూర్తిస్థాయిలో అనారోగ్యం ఉన్న ప్రతి పశువుకు ఇంటి ముంగిటకు వైద్య సేవలు అందేలా చూడాలి.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-గిద్దలూరు

నేరాల నియంత్రణకే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు గిద్దలూరు అర్బన్ ఇన్‌స్పెక్టర్ కె సురేష్ తెలిపారు. పట్టణంలోని అర్బన్ కాలనీలో శనివారం తెల్లవారుఝాము కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అర్బన్ ఇన్‌స్పెక్టర్ కె సురేష్ మాట్లాడుతూ కాలనీలో యువత గంజాయి, మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు అతి వేగంగా, అజాగ్రత్తగా నడపవద్దని కోరారు. వీటితో కలిగే ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుం బాలు రోడ్డున పడ్డాయని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరిం చారు. కాలనీలోకి అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తమపై వేధింపులను మహిళలు నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవ చ్చని పేర్కొన్నారు. ఈ కార్డన్ సెర్చ్‌లో సరైన పత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి నేతలకూ మద్యం దెబ్బ ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

సొమ్ము గ్రామాల్లో పేచీలకు కారణంగా మారుతోంది. గతంలోనూ ఇలాంటి ఉదంతాలు అనేకం ఉన్నాయి. అయితే ఈ పరిస్థితి కారణం కూడా ప్రభుత్వ విధానమే. గ్రామాల్లోని మద్యం దుకాణాలకు రూ.55 లక్షల నుంచి లైసెన్సు ఫీజు నిర్ణయించారు. నెలనెలా మద్యం కోసం పాతికపక్షలకుపైగా పెట్టాలి. ముందుగానే డీడీలు తీయాలి. ఇపుడుమళ్లీ గతంలో మాదిరిగానే టార్గెట్లు మొదలయ్యాయి. మద్యం అమ్మినా అమ్మకపోయినా ముందుగానే డీడీలు కట్టి మద్యం నిల్వపెట్టుకోవాలి. ఇపుడు ఎక్సైజ్‌శాఖ ఇదే పనిలో ఉంది. నిత్యం మద్యం దుకాణాలకు సరుకు పంపే పనిలోనే ఉంది.ఎంత తాగుతున్నారనేదీ వాళ్లకు అవసరం లేదు. ఈ ప్రక్రియ వల్లప్రభుత్వానికి నెలనెలా ఆదాయం వస్తుంది. ఖజానా నిండుతుంది. ఇలా బలవంతంగా దించుకున్న సరుకును ఏదోరకంగా అమ్ముతున్నారు. బెల్టు దుకాణాలు పెట్టుకున్నారు. ఊరూరా పెట్టారు. ఎవరి వాటాలు వాళ్లుతీసుకుని అంతా గప్‌చుప్‌గా ఉన్నారు. మద్యం ఊళ్లలో ఏరులైపారుతోంది. మహిళల్లో మద్యంపై తీవ్ర వ్యతిరేకత పెరుగుతోంది. గతంలో బెల్టు దుకాణాల్లేవు. ఇపుడు ఊరూరా ఇవే ఉన్నాయి. వీటి వల్ల ఊళ్లలోనే మద్యం దొరుకుతుంది.పనులకు పోయి ఇంటికి రాగానే తాగుతున్నారు. కూలీ డబ్బులు తాగుడుకే సరిపోతున్నాయి. మద్యం వ్యాపారంతో తెలుగుదేశం నేతలకుఉపాధి దొరికింది. ప్రభుత్వానికి పెద్ద ఎత్తున రాబడి పోగుబడుతోంది. ఒక్కో దుకాణం నెలకు రూ.40 లక్షల వ్యాపారం చేస్తోంది. ఆ సొమ్మంతా పేదలదే. కూటమి ప్రభుత్వం ఇంకేమీ మంచి చెడులు ఆలో చించడం లేదు. ఆదాయమే చూసుకుంటోంది. ఇదే తీరు నడిస్తే వైసిపి ప్రభుత్వానికి ఒక రకంగా మద్యం దెబ్బతగిలిదే.. కూటమికీ మరో రూపంలో అంటే మహిళల నుంచి తగలడం ఖాయమంటున్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి కొమరోలు

కొమరోలు ఎస్ఐ నాగరాజు తాటిచెర్ల గ్రామ సమీపంలోని అమరావతి అనంతపురం జాతీయ రహదారిపై శని వారం వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనా న్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అక్రమ మద్యం, గంజాయి, సమాజానికి హాని కలిగించే ఇతర వస్తువులు తరలింపును అరికట్టే అంశంలో భాగంగా జిల్లా ఎస్పీ దామోదర్ ఆదే శాల మేరకు వాహన తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. వాహనదారులకు రోడ్డు ప్రమా దాలపై అవగాహన, జాగ్రత్తలను వివరించారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

కుట్టు మిషన్లు, రుణపత్రాలు పంపిణీ



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మహిళలు అన్ని రంగాలలో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గొట్టగట్టు సచివాలయంలో మహిళలకు కుట్టు మిషన్లు, బీసీలకు రుణాలు మంజూరు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలని తద్వారా కుటుంబాలను మెరుగుపరుచుకోవాలన్నదే కూటమి ప్రభుత్వం ముఖ్యఉద్దేశం ఉన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రాధాన్యత క్రమంలో చేపట్టడం జరుగుతుందన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, తల్లికి వందనం ఏర్పాటు చేయబోతున్నామన్నారు. మార్కాపురం నియోజకవర్గానికి త్వరలో 3 బయో గ్యాస్ కంపెనీలు రాబోతున్నాయన్నారు. భవిష్యత్తులో పశ్చిమ ప్రాంతం అన్ని రంగాలలో ముందుంటుందన్నారు. అనేక కార్పొరేట్ కంపెనీలతో మాట్లాడి ఒప్పించి రాష్ట్రానికి రావాలని కోరగా వారు వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులకు కుట్టు మిషన్లు, రుణపత్రాలను అందజేశారు. సర్పంచ్ పెరికే సుఖ్‌దేవ్ మాట్లాడుతూ మహిళలు కుట్టు మిషన్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆవుల సురేష్, ఎంపీడీవో డి.ఈశ్వరమ్మ, ఈవోఆర్‌డి శ్రీదేవి, కార్యదర్శి బ్రహ్మానాయుడు, మండల మాజీ ఉపాధ్యక్షులు సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, మండల మాజీ కన్వీనర్లు తాసిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కనకం నరసింహం, వెలుగొండ దేవాలయం ఉత్సవ కమిటీ చైర్మన్ కుందూరు కాశిరెడ్డి, నాయకులు పరిటాల సుబ్బయ్య, కోనంకి సాల్మన్, ముప్వ కాటంరాజు, పొదిలి వెంకటేశ్వర్లు, పందిటి తిమోతి పాల్గొన్నారు.



గుడిసె, వేప చెట్టును ధ్వంసం చేసిన దృశ్యం

చెట్లు, పూరిగుడిసె ధ్వంసంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

చిన్నారికట్ల జంక్షన్ సమీపంలోని 78/2 సర్వే నెంబరులో తమ భూమిలోని కొంత భాగంలో వేసిన పూరి గుడిసె, వేప చెట్లు, ఫెన్సింగ్‌ను ఉడుముల దశరథ రామిరెడ్డి, శంకర్రెడ్డితో టూమోనీ జేసీబీ డ్రైవర్ అప్పలనాయుడు ధ్వంసం చేశారని మాజీ ఎమ్మెల్యే సోదరుడు ఉడుముల జగన్మోహన్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనకు పూర్వీకుల నుంచి సక్రమించి, మాతల్లి ఉడుముల ఆదిలక్ష్మమ్మ నుంచి భూమిని పొందానని, పొగాకు సాగు చేశానని పేర్కొన్నారు. 50 సెంట్ల స్థలంలో హెచ్‌పిసిఎల్ పెట్రోల్ బంకుకు లీజుకు ఇచ్చానని, న్యాయవాది లక్ష్మిరెడ్డి ప్రోద్భలంతో వేపచెట్టును తొలగించడంతో పాటు ఫెన్సింగ్ ధ్వంసం చేశారని, సుమారు రూ.2లక్షలుకు పైగా నష్టం వాటిల్లిందని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-దర్శి

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం గవర్న మెంట్ హాస్పిటల్‌లోని సిబ్బందికి గ్యాస్ ఫైర్లు, ఎలక్ట్రికల్ ఫైర్స్‌పై అవగాహన కల్పించారు. గ్యాస్ ఫైర్ అయినప్పుడు తీసుకోవాల్సిన నివారణ చర్యలు గురించి డెమో ద్వారా వారికి వివరించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశా రు. ఈ కార్యక్రమంలో కేంద్రాధికారి సిహెచ్.జాలయ్య, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరి: కనిగిరి అగ్నిమాపక కేంద్ర అధికారి సిహెచ్ బంగారుబాబు ఆధ్వర్యంలో శనివారం గోపినాథ్ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్‌లో సిబ్బందికి, ప్రజలకు అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డెమో నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోపినాథ్, హాస్పిటల్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కొండపి: కొండపిలోని సిహెచ్‌సి వైద్యశాలలో, దుర్గాదేవి వైద్యశాలలో హాస్పటల్ సిబ్బందికి, ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి వెంకటరావు మాట్లాడుతూ వైద్యశాల పరిసరాలలో అగ్నిమాపక పరికరాలు ఎల్లప్పుడూ పనిచేసే విధంగా ఉంచుకోవాలన్నారు.

శింగరాయకొండ: శింగరాయకొండలోని డాక్టర్ శివరామిరెడ్డి హాస్పిటల్లో శనివారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం ని ర్వహించారు. టంగుటూరు అగ్నిమాపక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఏ రమణారెడ్డి అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. లిఫ్ట్ ద్వారానే కాకుం డా మెట్లు ద్వారా కూడా రోప్ ద్వారా కూడా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మాన్ బి.పాల్ బర్నబా, టి.బాలకృష్ణ, పి.ఏసోబు, పి.సుబ్బారావు, ఎస్.శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

మార్టూరులో కలకలం

వైసిపి నేత ఫ్యాక్టరీలో భారీగా పేలుడు సామగ్రి లభ్యం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్, బాపట్ల జిల్లా

మార్టూరు సమీపంలోని నాగరాజు పల్లి గ్రామానికి చెందిన వైసిపి నేత ఫ్యాక్టరీలో భారీ ఎత్తున పేలుడు సామగ్రి లభ్యం కావడం సంచలం సృష్టించింది. పోలీసుల తనిఖీల్లో గ్రానైట్ క్వారీకి సంబంధించిన పేలుడు సామ్రగి లభ్యమైనట్లు తెలుస్తుంది. వైసిపి నేత దాసం హనుమంతరావు సంబంధించిన గోడౌన్ లో కొండ రాళ్లు పేల్చే మందు గుండు సామాగ్రి అధిక మొత్తంలో ఉన్నాయంటూ మార్టూరు సర్కిల్, ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. హనుమంతరావు గత కొన్ని సంవత్సరాలుగా క్వారీ నిర్వహించుకుంటు న్నాడు. కొండ రాళ్లు పేల్చటానికి మందు గుండు సామాగ్రిని నాగరాజు పల్లి గ్రామం వెలుపల బహిరంగ ప్రదేశంలోని గోడౌన్‌లో నిల్వ చేశాడు. శనివారం ఒక్కసారిగా పోలీసులు ఆ గ్రామానికి చేరుకొని హనుమంతరావుకు చెందిన గోడౌన్‌పై దాడులు నిర్వహించారు. ముందు గుండు సామాగ్రి ఎక్కువ మొత్తంలో నిల్వ ఉన్నాయంటూ హనుమంతరావును, ఆయన కారు డ్రైవర్, మరో ఇద్దరు సిబ్బందిని అదుపులోకి తీసుకొని మార్టూరు, బల్లికురవ పోలీస్ స్టేషన్లకు తరలించారు. బాపట్ల డిఎస్‌పి రామాంజనేయులు మార్టూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని విచారిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న వైసిపి నాయకులు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. దీంతో స్టేషన్ బయట భారీగా పోలీసులు మోహరించారు. మీడియాకి వివరాలు వెల్లడించడానికి డిఎస్‌పి నిరాకరించారు. విచారణ అనంతరం మాత్రమే వివరాలు తెలుపుతామని చెప్పడం గమనార్హం. స్టేషన్ బయట ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండలం అల్లూరులో శనివారం ఏడుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలియజేశారు. వారి నుంచి రూ.10,130 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కొత్తపట్నం మండలంలో చట్టాలకు అతిక్రమించి అసాంఘిక కార్యక్రమాలుకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఆయన తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

త్రిపురాంతకం మండలం ఎండూరివారిపాలెంలో అక్రమ మద్యం కలిగి ఉన్న ఎ.కోటయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు యర్రగొండపాలెం ఎక్సైజ్ సిఐ సిహెచ్ శ్రీనివాసులు తెలిపారు. వాటర్ ట్యాంకు సమీపంలో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాడన్న సమాచారం రావడంతో దాడులు నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ అక్రమ మద్యం విక్రయంపై నిరంతరం నిఘా పెట్టామన్నారు. అందులో భాగంగా విశ్వసనీయ సమాచారం ఆధారంగా ఈ దాడి చేపట్టినట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని తెలిపారు. ఎవరైనా అక్రమ మద్యం వ్యాపారం చేస్తే లేదా నిల్వ ఉంచితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తక్కెళ్ళపాడు రైతు భరోసా కేంద్రంలో

మొదలైన ప్రభుత్వ సేవలు

ప్రజాశక్తి-కనిగిరి

ప్రజాశక్తి కథనానికి స్పందన

కనిగిరి మండలం తక్కెళ్ళపాడు రైతు భరోసా కేంద్రంలో అందని ప్రభుత్వ సేవలు అన్న శీర్షికన ప్రత్యేక కథనాన్ని ప్రజాశక్తి దినపత్రికలో శనివారం ప్రచురితం కావడం జరిగింది. ఈ క్రాప్ నమోదు, కందుల కొనుగోలు కేంద్రంలో పండిన వంటను విక్రయించుకోలేని స్థితిలో రైతులు పడుతున్న ఇబ్బందులను ఈ కథనం ద్వారా వెలుగులోకి తీసుకురావడం జరిగింది. ప్రత్యేక కథనంతో వ్యవసాయ శాఖ అధికార యంత్రాంగం మేల్కొంది. ప్రజాశక్తి ప్రత్యేక కథనానికి స్పందించి రైతు భరోసా కేంద్రానికి ఇన్చార్జి సిబ్బందిని నియమిస్తూ ఏడిఏ ఎగ్గోని వెంకటరమణ ఉత్తర్వులు జారీ చేయగా మండల వ్యవసాయ అధికారిని పి జోష్నాదేవి అమలు చేశారు. గోసుల వీడు లో పనిచేస్తున్న ఎంపీఈఓ యు కిషోర్ ను తక్కెలపాడు రైతు భరోసా కేంద్రానికి ఇంచార్జి ఎంపీఈవోగా నియమించారు. వ్యవసాయ అధికారుల ఆదేశాల మేరకు ఎంపీ ఈవో కిషోర్ శనివారం తక్కెళ్ళపాడు రైతు భరోసా కేంద్రం తలుపులు తెరిచి విధులకు హాజరయ్యారు. రైతులు పండించిన కంది పంటను గిట్టుబాటు ధర పొందేలా విక్రయించుకునేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వ సేవలు ప్రారంభం కావడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ప్రజాశక్తికి ధన్యవాదాలు తెలియజేశారు.

జీవో 117ను రద్దు చేయడమే ఉత్తమం

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మినిగ శ్రీను



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మీనిగ శ్రీను

ప్రజాశక్తి-దర్శి

విద్యావ్యవస్థ బాగుపడాలంటే జీవో 117ను రద్దు చేయడమే మార్గమని, ఏటువంటి ప్రత్యామ్నాయాలు వద్దని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మీనిగ శ్రీను అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ జీవో నెం.117ను రద్దు చేస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రత్యామ్నాయ మార్గాలను తీసుకొస్తామని చెప్పడం సరికాదన్నారు. గత ప్రభుత్వం 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో కలిపి విద్యను దూరం చేసిందన్నారు. ఇప్పుడు 1500 పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులు ఏర్పాటు చేస్తామని చెప్పడం ఎంత వరకు సమర్ధనీయం అని ప్రశ్నించారు. ప్రాథమికోన్నత పాఠశాలలో సబ్జెక్ట్ టీచర్లతో విద్యను అందించాలని చెప్పి ఇప్పుడు అదే పాఠశాలలో ఎస్‌జిటిలతో భోధన చెప్పిస్తామనడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఆర్‌టిఇ యాక్టు ప్రకారం 1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయులను నియమించాలని, ఫౌండేషన్ స్కూల్స్‌ను రద్దు చేసి బేసిక్ ప్రైమరీ స్కూల్స్ ఉంచాలని, ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.ఖాసిం, గౌరవాధ్యక్షులు ఎం.యలమందారెడ్డి, కోశాధికారి కె.రామారావు, సహాయధ్యక్షులు అట్లూరి రామారావు, సీనియర్ నాయకులు రామిరెడ్డి, కార్యదర్శులు కె.విజయ్‌భాస్కర్, ఎం.తిరుపతిరెడ్డి, ఎం.రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, రోశయ్య, వెంకటేశ్వర్లు, పిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ



పంపిణీ చేసిన దుస్తులతో క్రీడాకారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం, పాకల పంచాయతీ పరిధిలో పోతయ్యగారిపాలెంలో క్రికెట్ క్రీడాకారులకి శనివారం జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఐనాబత్తిన రాజేష్, గ్రామ కాపులు సిహెచ్ బ్రహ్మయ్య, కే నరసింహ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ వ్యాయామం అనేది చాలా ముఖ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కాసుల శ్రీనివాస్, కార్యదర్శి అనుముల శెట్టి కిరణ్ బాబు, కిచ్చెం శెట్టి ప్రవీణ్ కుమార్, ప్రచార కార్యదర్శి తగరం రాజు, మమిళ్ల మణి కంఠ, పూసల కిరణ్ మరియు జన సైనికులు పాల్గొన్నారు.



వాటర్ ఫ్రిజ్ అందజేసిన దాత వెంకటరెడ్డి

వాటర్ ఫ్రిజ్‌లు బహూకరణ

ప్రజాశక్తి-సిఎస్ పురం

ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సారథ్యంలో మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన తెలుగు యువత నాయకులు చెరుకుపల్లి వెంకటరెడ్డి స్వంత నిధులు రూ.30 వేలతో సిఎస్.పురం తహశీల్దార్ కార్యాలయానికి, సచివాలయం-1కు, ఉప్పలపాడు సచివాలయానికి ఒక్కొక్కటి చొప్పున మొత్తం మూడు వాటర్ ఫ్రిజ్‌లను శనివారం ఆయా కార్యాలయాలకు బహూకరించారు. ఈ సందర్భంగా దాత చెరుకుపల్లి వెంకటరెడ్డిని తహశీల్దార్ మంజునాథరెడ్డి, సచివాలయం-1 సెక్రటరీ బ్రహ్మానందరెడ్డి, ఉప్పలపాడు సచివాలయ ఉద్యోగులు అభినందించారు.

ఎన్‌టిఆర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలో జగనన్న కాలనీగా ఏర్పడి, ప్రస్తుతం పిఎంవై, ఎన్టీఆర్ నగర్‌గా పేరు మార్చబడిన చోట నివాసానికి అవసరమైన కనీన సదుపాయాలు ఏర్పాటు చేయించాలని రెవిన్యూ మంత్రి కార్యాలయంలో టిడిపి సీనియర్ నాయకులు అనగాని శివప్రసాద్‌కు కాలనీవాసులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇళ్ళు కట్టుకోవాలని, లేకపోతే స్థలాలు వెనక్కి తీసుకుంటామని ఒత్తిడి చేయడంతో రూ.లక్షలు అప్పులు చేసి ఇల్లు కట్టుకున్నామని, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ, మంచినీళ్ల సదుపాయాలు లేకపోవడంతో ప్రస్తుతం తీవ్రఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో సొంత ఇళ్ళు కూడా ఖాళీ చేయాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. తమ సమస్యలకు మంత్రి అనగాని సత్యప్రసాద్ శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అప్పటివరకు వర్షాకాలంలో కనీసం ప్రధాన రోడ్లపై గ్రావెల్ ద్వారా



అనగాని శివప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

మేరకలు పోసి నడిచేందుకు అనువుగా చేయాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రజలు 1159 మంది సెంటు స్థలంలో అప్పులు చేసి ఇళ్ళు కట్టుకుని నివాసం ఉంటున్నారని అన్నారు. కాలనీలో రోడ్లు నిర్మాణం చేయకపోవడం, మెరక లేకపోవడంతో ఇప్పుడు వర్షాలు వస్తే వర్షం నీళ్లలో నెలలు తరబడి దోమలు, పాముల మధ్య నివాసం ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గత ప్రభుత్వం సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రస్తుతం ఎన్టీఆర్ నగర్‌గా పేరుమార్చిన కాలనీలో ఇప్పటి టిడిపి కూటమి ప్రభుత్వమైనా మౌళిక వసతులు కల్పించాలని కోరారు. ఫ్లాట్ నెంబరు ఆధారంగా డోర్ నెంబరు కేటాయించాలని అన్నారు. ప్రతిఇంటికి ఉచిత నీటి కనెక్షన్ ఇవ్వాలని అన్నారు. అప్పటి వరకు ప్రస్తుత వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీళ్లు అందించాలని కోరారు. వీధిదీపాలు వెలిగే విధంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు చేసి దోమలు నివారించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ నగర్ (జగనన్న కాలనీ) అభివృద్ధి కమిటి కన్వినర్ వి దనమ్మ, కో కన్వీనర్ కె రవికుమార్, సహాయ కార్యదర్శి కె నాంచారమ్మ, వనజాక్షి, కృష్ణకుమారి, రాధ, కె వీరాంజనేయులు, సిపిఎం నేతలు డి అగస్టీన్, కె ఆశీర్వాదం పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మైనేని మురళీకృష్ణ

చంద్రబాబు జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కొల్లూరు

ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఈనెల 20న ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్లో కేక్ కటింగ్ ఏర్పాటు చేసినట్లు టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ తెలిపారు. శాసన సభ్యులు నక్క ఆనందబాబు చేతుల మీదగా అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న డాక్టర్ సుబ్బారావు

వివాహ వేదికను వినియోగించుకోండి

ప్రజాశక్తి - చీరాల

ఒంగోలులో పద్మావతి ఫంక్షన్ హాలులో మే 4న ఆదివారం జరుగు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయి బ్రాహ్మణ ఉద్యోగుల, సాంస్కృతిక, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత వివాహ పరిచయ వేదిక వినియోగించుకోవాలని హైమా హాస్పిటల్ డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు, కామాక్షి కేర్ హాస్పిటల్ డాక్టర్ తాడివలస దేవరాజు కోరారు. స్థానిక హైమ హాస్పిటల్ ఆవరణలో ఉచిత వివాహ వేదిక కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ దేవరాజు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా మూడు వేల మందికి పైగా ఉచితంగా వివాహ వేదిక ద్వారా వివాహాలు చేసినటువంటి వివాహ పరిచయ వేదిక నిర్వాహకులను అభినందించారు. నాయి బ్రాహ్మణ వధూవరుల కోసం ఎదురుచూస్తున్న తల్లి, దండ్రులు, యువతీ, యువకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వివాహ వేదిక కన్వీనర్ నాదెండ్ల రాఘవ మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాల నుండి గత ఐదేళ్లుగా ఎంతోమంది ఈ వివాహ వేదికలో పాల్గొంటున్నారని తెలిపారు. వధూవరుల పరిచయం తమదని, నిర్ణయం మీదని తెలిపారు. పోతకమూరి మధుబాబు, మార్యాపూరాం వెంకట రామారావు పాల్గొన్నారు.

అమెరికాలో కుంద్రురు యువకుడు మృతి

ప్రజాశక్తి - సంతమాగులూరు



అవినాష్ (ఫైల్)

మండలంలోని కుందుర్రు గ్రామానికి చెందిన బోడేపూడి రాజబాబు కుమా రుడు అవినాష్ అమెరికాలో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయ లు అలుముకున్నాయి. బోడేపూడి రాజ బాబు 10ఏళ్ల నుండి గుంటూరులో నివాసం ఉంటున్నారు. రాజ బాబుకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడైన బోడేపూడి అవినాష్ అమెరికాలో సాఫ్ట్ వేర్ ఇంజనీరుగా ఉద్యోగం చేస్తున్నాడు. అవినాష్‌కు ఈ ఏడాది మార్చి 15న గుంటూరులో వివాహం చేశారు. ఈనెల 5న అమెరికా వెళ్లాడు. ఏప్రిల్ 13న అమెరికాలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించాడు. శనివారం మృతదేహాన్ని అమెరికా నుండి గుంటూరుకు తీసుకు వచ్చారు. సాయంత్రం అంతిమ సంస్కారాలు నిర్వహిం చారు. అమెరికాలో ఉద్యోగం చేస్తూ నెల క్రితమే వివాహమై హఠాన్మరణం చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు శోకసముద్రంలో మునిగిపోయారు. అందివచ్చిన కొడుకు మరణం కుటుంబ సభ్యులను కృంగదీసింది. గుంటూరులో రాజబాబు నివాసానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రెండు రోజుల క్రితం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

మధ్యాహ్న భోజనం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - చీరాల



ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్నం భోజనం కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచి సకాలంలో అందించాలని సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఎపి మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల యూనియన్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ.10వేల వేతనం చెల్లించాలని అన్నారు. కార్మికుల వేతనాలను ప్రతి నెల 5లోపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం బడ్జెట్ పెంచాలని అన్నారు. మెను చార్జీలు రూ.20లకు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న అందరూ నిరుపేదలని అన్నారు. అప్పులు తీసుకొచ్చి వంట వండుతున్నారని అన్నారు. 9, 10 తరగతులకు భోజనం వండుతున్న కార్మికులకు యూనిఫారం ఇవ్వాలని అన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఉపాధి భద్రత కల్పించి రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. ఎంఈఓ ఆఫీసులో సమస్యలపై వినతి అందజేశారు. కార్యక్రమంలో ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సిఐటియు నాయకులు విజయ వెంకటేశ్వరమ్మ, చాముండేశ్వరి, రూటుమ్మ, రాములమ్మ, ఆకురాతి, మాధవి పాల్గొన్నారు.

ఘనంగా రాయల్ పయనీర్స్ వార్షికోత్సవం



సభలో మాట్లాడుతున్న పాఠశాల డైరెక్టర్ రవీంద్రబాబు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యంగా రాయల్ విద్యా సంస్థలు ఏర్పాటు చేసినట్లు విద్యా సంస్థల అధినేత పేరం రవీంద్రబాబు, పేరం స్వప్న తెలిపారు. గత 30 ఏళ్లుగా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరేలా తీర్చిదిద్దినట్లు తెలిపారు. రాయల్ విద్యా సంస్థల కృషిని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావుల బాపయ్య అభినందించారు. మార్టూరు రాయల్ విద్యా సంస్థలకు చెందిన పయనీర్స్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ సాఫ్ట్ స్కిల్స్ శిక్షకుడు, మోటివేషనల్ వక్త పి మహర్షి సాగర్ మాట్లాడుతూ చిన్నారుల్లో చదువుల పట్ల ఆసక్తి కలిగించి, వారిలో సృజనాత్మకత వెలికితీయడానికి ఉపాధ్యాయులతో పాటు తల్లి, తండ్రులు కృషి చేస్తే ఆ విద్యార్థి ఉన్నత విద్య అభ్యసించి అత్యున్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు. మహర్షి సాగర్ ఆద్యంతం ఉత్తేజపూరితంగా మాట్లాడారు. విద్యా సంస్థ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పేరం రవీంద్రబాబు, డైరెక్టర్ పేరం స్వప్న మాట్లాడుతూ ఆధునిక బోధనా పద్ధతులు పాటిస్తున్నట్లు తెలిపారు. పూర్తిస్థాయి వసతులతో ఆహ్లాదకరమైన తరగతి గది వాతావరణంలో ఆంగ్లభాషలో నిపుణులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ఇంచార్జ్ కుడారి మధు బాబు మాట్లాడుతూ 1995 నుండి రాయల్ విద్యా సంస్థలు సాధించిన విజయాలు వివరించారు. స్థాపించిన నాటి నుండి 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతి విద్యార్థిని అగ్రస్థానంలో నిలబెట్టడానికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మార్టూరు, యద్దనపూడి ఎంఇఒలు ఎంసిహెచ్ వస్రాం నాయక్, కె ప్రేమలత, చిలుకూరి గోపి పాఠశాల సాధిస్తున్న విజయాల పట్ల అభినందనలు తెలిపారు. కిండర్ గార్డెన్ పూర్తిచేసుకున్న చిన్నారులకు సర్టిఫికెట్, మెడల్స్ అందించి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి రాధిక, హైస్కూల్ హెచ్‌ఎం డివి బాలసుబ్రమణ్యం, ఎఒ భానుప్రకాష్ పాల్గొన్నారు.



చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం



నూతన విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యవర్గం

విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా కమలేశ్వరావు

ప్రజాశక్తి - ఇంకొల్లు

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షునిగా కరి కమలేశ్వరరావు ఏకగ్రీవంగా శనివారం ఎంపికయ్యారు. కార్యదర్శిగా తగిరస వీరాంజనేయులు, కోశాధికారి భవనం హరేరామిరెడ్డి ఎన్నికయ్యారు. వీరితోపాటు 13మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. స్థానిక తగెరిసా వీరాంజనేయులు భవనంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల ఫలితాలు ఎన్నికల అధికారి టి కృష్ణయ్య ప్రకటించారు. సహాయ ఎన్నికల అధికారిగా ఎన్ నాగేశ్వరరావు, జిల్లా పరిశీలకులు షేక్ కమాలుద్దీన్, జిల్లాఅధ్యక్షులు ఆర్ బాపయ్య చౌదరి, మార్టూరు అధ్యక్షులు కొరిటాల రామారావు పాల్గొన్నారు.

సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి

ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన అధ్యక్షులు కరి కమలేశ్వరరావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడు ముందుంటానని అన్నారు. కార్యవర్గ సభ్యుల సహాయ సహకారాలతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.



డొంక సమస్యను పరిశీలిస్తున్న తహశీల్దారు , రెవెన్యూ సిబ్బంది

డొంక సమస్యపై తహశీల్దారు పరిశీలన

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని చందలూరు, ఇంకొల్లు మండలం కొనికి గ్రామాల మధ్య ఉన్న డొంక సమస్య పరిష్కరిస్తానని తహశీల్దారు ఈ సింగారావు హామీ ఇచ్చారు. ఈ మేరకు రెండు గ్రామాల రైతులకు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందలూరు గ్రామ సర్వే నెంబరు 819లో చందలూరు, కొనికి గ్రామాల మధ్య సరిహద్దు డొంక ఉందని, ఈ డొంక చందలూరు రెవిన్యూకు సంబంధించినదని చెప్పారు. ఈ డొంకలో కొనికి గ్రామానికి చెందిన కొంత మంది రైతులు కొంతమేర మట్టి తోలి, చందలూరు రైతుల పొలాల్లోని వర్షపు నీరు బయటకు వెళ్ళనివ్వకుండా ఆటంకం కలిగిస్తున్నారని చెప్పారు. ఈ సమస్య శనివారం పరిశీలించామని తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్ బాబు, గ్రామ సర్వేయర్ నాగార్జునరావు, విఆర్ఓ పరశురాంరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి

ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జి అధికారి సురేష్



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి అధికారి సురేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుని జిల్లా అన్ని విధాలా అభివృద్ధి చెందేలా అధికారులు చర్యలు వేగవంతం చేయాలని పురపాలక, పట్టణాభివద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా ప్రత్యేక అధికారి ఎస్. సురేష్ కుమార్ తెలిపారు. శనివారం జిల్లాకు వచ్చిన సందర్భంగా అన్ని శాఖల ఉన్నతాధికారులతో కలెక్టరేట్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం తనను ప్రత్యేక అధికారిగా నియమించినట్లు తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీ,మూడో శనివారం జిల్లాకు వస్తానన్నారు. జిల్లా అభివద్ధికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన ప్రత్యేక నిర్ణయాలు ఏమైనా ఉంటే కలెక్టరు ద్వారా తన దష్టికి తీసుకురావాల న్నారు. గ్రీవెన్స్, ధాన్యం సేకరణం, దీపం, అన్న క్యాంటీన్, రెవెన్యూ సదస్సులు, విద్య, వైద్యం, సంక్షేమం, పౌర సరఫరాలు, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య, గనులు, పరిశ్రమలు, రహదారులు, భవనాలు, పారిశుధ్యం, తాగునీరు, పిఎం సూర్య ఘర్, హౌసింగ్, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన తదితర అంశాలపై ఈ సందర్భంగా సురేష్ కుమార్ సమీక్షించారు. పథకాల ప్రయోజనాలు ప్రజలకు అందడంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని తెలిపారు. రెవెన్యూ సదస్సులు, 'మీ కోసం" కార్యక్రమాలలోనూ వస్తున్న అర్జీల పరిష్కారంలో నాణ్యత అత్యంత కీలకమన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలని స్పష్టం చేసారు. కలెక్టరు స్పందిస్తూ రెవెన్యూ సమస్యలకు సంబంధించిన అర్జీల పరిష్కారంలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నట్లు తెలిపారు. అసైన్డ్ భూములు, నిషేదిత జాబితాలోని భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం నిర్ణయం తెసుకోవాల్సిన కేసులు ఉన్నాయన్నారు. మండల స్థాయి నుంచి ఈ కేసులను రాష్ట్ర ప్రభుత్వానికి అధికారులు నివేదిస్తున్న క్రమంలో తమ సమస్యలు పరిష్కారం కాలేదంటూ అర్జీలను ప్రజలు రీ ఓపెన్ చేస్తున్నారని ఆమె వివరించారు. రీ ఓపెన్ అవుతున్న అర్జీలను ఆడిట్ చేయడానికి ప్రత్యేక బందాలను ఏర్పాటు చేశామన్నారు. తొలుత బంగారు బాల్యం కార్యక్రమానికి సంబంధించి ప్రకాశం భవనంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్‌ను సురేష్ కుమార్ సందర్శించారు. ఈ సెంటర్ ఏర్పాటు నేపథ్యాన్ని, జిల్లాలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న తీరును కలెక్టరు ఆయనకు వివరించారు. ఈ సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, ఒంగోలు ఆర్‌డిఒ లక్ష్మీ ప్రసన్న, కనిగిరి ఆర్‌డిఒ కేశవర్ధన్ రెడ్డి, సిపిఎం వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రేమ్ కుమార్‌ను అభినందిస్తున్న విసి రిజిస్ట్రార్

విజేతకు అభినందనలు

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ : అఖిల భారత స్థాయిలో నిర్వహించిన ఆల్‌ఇండియా యూనివర్సిటీ 'పెన్ కాక్ సిలాట్' పోటీలలో ఆంధ్ర కేసరి యూనివర్సిటీ తరుపున పాల్గొని బంగారు పతకాన్ని సాధించిన కె.ప్రేమ్‌కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీవరప్రసాద్‌ను యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డివిఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు శనివారం అభినందించారు. తొలి సంవత్సరం, తొలి ప్రయత్నం లోనే ఆంధ్ర కేసరి యూనివర్సిటీ కి చెందిన క్రీడాకారుడు ప్రేమ్ కుమార్ అఖిల భారత స్థాయిలో కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప జేయడం పట్ల వైస్ ఛాన్సలర్ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుడు అడపాల వెంకటేశ్వర్లు, ఎకెయు టీము సెలక్షన్ కమిటీ సభ్యుడు గంటా సాయి సురేష్, సిడిసి డీన్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ జి.సోమశేఖర,పెన్ కాక్ సిలాట్ సౌత్ జోన్ సెక్రటరీ పి.మనోజ్ సాయి, కోచ్ పి. వంశీ పాల్గొన్నారు.

'పాజిటివ్ లైఫ్' మాసపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ : ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ పెద్దిగారి లక్ష్మన్న రచించిన 'పాజిటివ్ లైఫ్ మ్యాగ్జైన్' మాస పత్రికను ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ విద్యా, వైద్యం, క్రీడలకు సంబధించిన ముఖ్యమైన అంశాలతో ముద్రించిన మాసపత్రికలో విద్యార్థులకు, సాధారణ పౌరులకు, ఉపాధ్యాయులకు, కుటుంబ సభ్యులు అందరికి చాలా బాగా ఉపయోగపడే సమాచారం ఉందని తెలిపారు. సమాచారం వయసుతో సంబంధం లేకుండా వ్యక్తుల జీవనశైలికి దోహదపడుతుందన్నారు. ఎకెయు సిడిసి డీన్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ జి. సోమశేఖర మాట్లాడుతూ 'పాజిటివ్ లైఫ్ మ్యాగ్జైన్' మాస పత్రికను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడటమే కాకుండా ముఖ్యమైన అంశాలలో మార్గదర్శిగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మ్యాగ్జైన్ రచయిత డాక్టర్ లక్ష్మన్నను ఎకెయు రిజిస్ట్రార్ హరిబాబు, సిడిసి డీన్ సోమశేఖర అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్టు,ప్రోగ్రెసివ్ సైకాలజిస్టుల అసోసియేషన్ నేత డాక్టర్ పాపారావు పాల్గొన్నారు.

ఏకరీతిలో ఉపాధ్యాయుల కేటాయింపు జరగాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : పాఠశాలల్లో ఉపాధ్యాయుల కేటాయింపు ఏక రీతిగా అమలు చేయాలని ఎపిటిఎఫ్ డిమాండ్ చేసింది. ఎపిటిఫ్ రాష్ట్ర కార్యదర్శి కెవిజి.కీర్తి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు బి. వెంకట రావు, గౌరవాధ్యక్షుడు ఎ.అమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.లక్ష్మీ నారాయణ, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బి. అశోక్ కుమార్, ఐ.ఫి.యా కౌన్సిలర్స్ ఎం. రాఘవరావు, పివి.సుబ్బారావు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. పాఠశాల విద్య సంస్కరణల్లో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలలు, తల్లి తండ్రుల కోరిక మేరకు కొనసాగిస్తున్న బేసిక్ ప్రైమరీ పాఠశాలలపై వివక్ష తగదని పేర్కొన్నారు. యుపి పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు కొనసాగించాలని కోరారు. హైస్కూల్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో 31 మంది విద్యార్థులకు నలుగురు టీచర్లతో బోధించి, బేసిక్ స్కూల్స్ లో 31 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లను నియమించడం సరికాదన్నారు. ఫౌండేషన్ స్కూల్స్‌లో 1:20 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. విద్యార్థులు తమకు అనువైన చోట చదువుకునే స్వేచ్ఛ ఉండాలన్నారు. వివక్షతో పాఠశాలలను బలవంతంగా విలీనం చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల దంపతులు


చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్ : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు తాము కృషిచేస్తున్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు తెలిపారు. డిజెఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు నగరం లోని 6 ముఖ్య కూడలిలలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎమ్మెల్యే దామచర్ల దంపతులు శనివారం ప్రారంభించారు. బికె.అపార్ట్‌మెంట్, కలెక్టర్ కార్యాలయం, కోర్టు సెంటర్ కొణిజేడు బస్టాండ్, కర్నూల్ రోడ్ ఫ్లైఓవర్, గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం వద్ద చలివేంద్రాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి డిజెఆర్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దామచర్ల రత్తమ్మ , ఎమ్మెల్యే సతీమణి నాగసత్యలత , కుమార్తె అనీషా లక్ష్మి పాల్గొన్నారు.

27న 'కవన విజయం' సాహిత్య రూపక ప్రదర్శన

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ : జాతీయ నాటకోత్సవాల ప్రదర్శనల ఏర్పాటులో భాగంగా డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు 'కవన విజయం' సాహిత్య రూపకం 525వ ప్రదర్శన ఈ నెల 27న చీరాలలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. చీరాలలోని కెజిఎం హైస్కూల్ ఆవరణలో, వాసుదేవ విలాస్ సెంటర్‌లో 27వ తేదీ సాయంత్రం 7 గంటలకు ప్రదర్శన ఉంటుందని నిర్వా హకులు నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, బత్తుల బ్రహ్మారెడ్డిఓ ప్రకటనలో తెలిపారు.డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ నేతత్వంలో నిర్వహిస్తున్న ప్రదర్శనలో ప్రయోక్తగా కళారత్న డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, ప్రబంధకవిగా సిహెచ్.ఏడుకొండలు, భావకవిగా నట్టే ప్రసాద్, అభ్యుదయకవిగా కప్పగంతు జయరామయ్య, దిగంబరకవిగా డాక్టర్ నూనె అంకమ్మరావు ,విప్లవకవిగా ఈదుమూడి ఆంజ నేయులు, సినీకవిగా కసుకుర్తి శ్రీనివాసరావు, దళిత కవిగా డాక్టర్ బీరం సుందరరావు, నవలా రచయిత్రిగా ఈదుమూడి జయంతి,స్త్రీవాద కవయిత్రిగా తేళ్ళఅరుణ ,ప్రజాకవిగా నూకతోటి శరత్ బాబు, క్లార్క్ సూర్యా రావుగా బ్రహ్మారెడ్డి పాత్రధారులుగా ఉంటారని వారు పేర్కొన్నారు.

జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ ఇదే...

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం కమిటీ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఒంగోలు నగర, రూరల్ కొత్త కమిటీలను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా పోలవరపు సుధాకర్ రావు, కార్యదర్శిగా టి. రమేష్ బాబు, కోశాధికారి సిహెచ్. యోగి రామయ్య, గౌరవాధ్యక్షుడిగా ఎ. రాజా, మీడియా ఇన్‌ఛార్జి దాసరి సుధాకర్, ఉపాధ్యక్షులుగా ఎం. శ్రీనివాసరావు, హరి నారాయణ, సహాయ కార్యదర్శిగా టివి. సుబ్బారావు, కె. వంశీకష్ణ ఎన్నికయ్యారు. మరో 12 మందిని కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు మేముల మాల కొండయ్య, కార్యదర్శి కె. బాలచంద్రం, సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భావితరాలు మంచి పర్యావరణాన్ని అందించాలి



స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

భావితరాలకు మంచి పర్యా వరణాన్ని అందించాలని కలెక్టరేట్ ఎఒ సీతారత్నం తెలిపారు. కలెక్టరేట్‌లో స్వచ్ఛఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ మన చుట్టూ పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం పేరుతో పరిశుభ్రత కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టరేట్ లోని ఉద్యోగులు పాల్గొని వ్యర్థాలను తొలగించారు. పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పర్యవేక్షకులు షేక్ షఫీ, సతీష్, సంధ్యశ్రీ, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా : జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ లు, పోలీస్ కార్యాలయాల్లో 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ అధికారులు సిబ్బంది నిర్వహించారు. స్టేషన్లు, కార్యాలయాలను శనివారం శుభ్రం చేశారు. చుట్టుపక్కల పరిసరాలలోని చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు, పచ్చికను తొలగించి పరిశుభ్రం చేశారు.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్' కార్యక్రమం ప్రారంభించింది. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించాలని సూచనలు చేసింది. అందులో భాగంగా ఎస్‌పి తుషార్ డూడి ఆదేశాల మేరకు జిల్లా ఎఆర్ డిఎస్‌పి విజయ సారథి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ నారాయణ, అడ్మిన్ ఆర్‌ఐ మౌలుద్దీన్, ఎంటి ఆర్‌ఐ శ్రీకాంత్, ఇతర పోలీసు అధికారులు, ఎఆర్ సిబ్బంది కలిసి పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌ను, ఎస్‌పి క్యాంప్ కార్యాలయం పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎఆర్ డిఎస్‌పి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు చుట్టు ప్రక్కలను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దీంతో అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడు తుందన్నారు. భావితరాలకు మెరుగైన ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.



స్వచ్ఛత కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



మాట్లాడుతున్న ఎంపిపి లలిత కుమారి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించే విధంగా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు చర్యలు చేపట్టాలని ఎంపీపీ డివి లలిత కుమారి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి ఎంఇఒ పి లాజర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. బడి బయటున్న పిల్లలను బడిలో చేర్పించే విధంగా గ్రామ పెద్దల సహకారంతో ఉపాధ్యాయులు, అంగనవాడీలు కృషి చేయాలని అన్నారు. జడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంలు విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా చూడాలని అన్నారు. ప్రవేటు పాఠశాలలను అనుకరించే ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని అన్నారు. ఎంఈఓ పులిలాజర్ మాట్లాడుతూ ఎపిఎఎఆర్ పెండింగ్ ఉన్న వారికి ఉపాధ్యాయులు పిల్లలను ఆధార్ కేంద్రాలకు తీసుకువెళ్లి ఆధార్ నమోదయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఒ ఎస్ వెంకటరమణ, ఈఒపీఆర్ అండ్ ఆర్ టి ఉగారాణి, ఎంఈఓ నీలం దేవరాజు, అంగన్‌వాడి సూపర్వైజర్లు సంపూర్ణ, మాణిక్యం, సునీత పాల్గొన్నారు.

అద్దంకి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ బి సింగయ్య అధ్యక్షతన 2025-26 విద్యా సంవత్సరంకు సంబందించి ప్రభుత్వ పాటశాలల్లో 1వ తరగతి, 6వ తరగతిలో విద్యార్థుల నమోదుకు సంబంధించి క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, సీఆర్పీలు, సీడీపీఓలతో శనివారం సమావేశం నిర్వహించారు. బొమ్మనంపాడు జెడ్‌పి ఉన్నత ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం సిహెచ్‌వి శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ మండలంలోని అంగన్‌వాడీ సూపర్ వైజర్లు తమ పరిధిలోని సెంటర్ల నుండి ఐదేళ్లు నిండిన బాల బాలికల వివరాలను సేకరించి సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలకు తెలియజేయాలని అన్నారు. 21, 22, 23 తేదీల్లో ఆయా హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తల సహకారంతో ఇంటింటి సర్వే నిర్వహించి పిల్లలందరినీ ప్రభుత్వ పాటశాలల్లో నమోదు అయ్యే విధంగా చూడాలని చెప్పారు. 5వ తరగతి పూర్తి చేసిన బాల, బాలికలందరినీ 21న సంబంధిత ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో చేర్చుటకు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. పాఠశాలల ప్రవేశాలపై రోజువారీ సమీక్ష చేస్తామని తెలిపారు. హెచ్‌ఎంల వద్దకు సాయంత్రానికి అంగన్‌వాడీ కార్యకర్తల నుండి ఐదేళ్లు నిండిన పిల్లల వివరాలు చేర్చాలని తెలిపారు. ప్రతి సిఆర్‌పి తన పరిధిలోని పాటశాలల్లో అందరు హెచ్‌ఎంలను పర్యవేక్షించాలని కోరారు. నూరుశాతం విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేందుకు సమిష్టిగా కృషి చేయాలని చెప్పారు.



మాట్లాడుతున్న అద్దంకి ఎంపిడిఒ శింగయ్య



పోలీస్ అధికారులతో సమీక్షిస్తున్న సివిల్ జడ్జి శాంతి

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి - పర్చూరు

రాజీ పడదగిన కేసులను లోకదాలత్‌లో పరిష్కరించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి పి శాంతి కోరారు. స్థానిక కోర్టులో పోలీసు అధికారులతో క్రిమినల్ కేసులపై శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 10న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసుల్లో ఇరు వర్గాల వారితో సామరస్యంగా మాట్లాడి వారి కేసులను లోకదారత్‌లో ప్రవేశపెట్టి పరిష్కరించాలని చెప్పారు. ఎవరిని బలవంతంగా రాజీకి రావాలని చెప్పవద్దని సూచించారు. కేసులు రాజీ చేయడానికి ప్రతి స్టేషన్‌లో బృందాన్ని నియమించాలని తెలిపారు. సమావేశంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్, పోలీసు సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాలపై ఆసుపత్రి సిబ్బందికి అవగాహన దృశ్యం

ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - బాపట్ల

ఆసుపత్రుల్లో అనుకోని రీతిలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే మంటలు ఆర్పేందుకు తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై వైద్యులు, వైద్య సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణ పట్ల అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి వై వెంకటేశ్వర్లు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో ఏరియా వైద్యశాల్లో ఆసుపత్రి సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే నివారించేందుకు ఆస్పత్రి వార్డుల్లో అగ్ని నిరోధక గ్యాస్ టియర్ అందుబాటులో ఉంచాలని అన్నారు. ఆసుపత్రి రసాయనాలు వినియోగించే సమయాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆసుపత్రి సిబ్బందికి టియర్ గ్యాస్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. అగ్ని ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తూ ప్రచురించిన కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

గూడవల్లి 'త్రిపురనేని ఐటిఐ' కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండంలోని గూడవల్లిలోని త్రిపురనేని రామస్వామి చౌదరి ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రావి శ్యాంప్రసాదరావు తెలిపారు. 21న సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఎల్ అండ్ టి నిర్మాణ సంస్థ, ఫక్స్ టెక్ సొల్యూషన్స్, గోదావరి, ఆంధ్ర కో-ఆపరేటివ్ సొసైటీ, వీల్స్ ఇండియా, కాప్టన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు ఆయా కంపెనీల్లో ఉద్యోగాల నియామకానికి ఎంపికలు నిర్వహిస్తారని తెలిపారు. ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమా, బీటెక్, డిగ్రీ చదివిన 18 నుండి 35ఏళ్ల వయస్సు కలిగిన యువతీ, యువకులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో జాబ్ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

స్వాతంత్ర సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా పట్టణంలోని చీలు రోడ్డు సెంటర్లో ఉన్న లచ్చన్న విగ్రహానికి శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ పూల మాల వేసి శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు అభ్యున్నతికి గౌతు లచ్చన్న ఎంతగానో కృషి చేశారని అన్నారు. ఆయన స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసామిరెడ్డి, బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, జనసేన ఇన్‌ఛార్జి నామన వెంకట శివన్నారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు పాల్గొన్నారు.



లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భట్టిప్రోలు : స్వతంత్ర సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న 20వ వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పెద్దపులివరు పంచాయితీలోని గుప్తావారిపాలెంలో ఉన్న గౌత లచ్చన్న విగ్రహానికి విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పరిస వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పూల మాల వేసే నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1909లో శ్రీకాకుళం జిల్లా సోంపేట తాలూకాలో ఆగస్టు 16న లచ్చన్న జన్మించారని అన్నారు. సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం, దండి సత్య గ్రహం వంటి స్వతంత్ర పోరాటాల్లో పాల్గొని జైలు జీవితాన్ని గడిపారని గుర్తు చేశారు. బీసీల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన గౌతు లచ్చన్న ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు అనగాని ఏడుకొండలు, వాకా శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



అంజయ్య మృత దేహానికి నివాళులర్పిస్తున్న అశోక్ బాబు

వైసిపి నాయకుడు అంజయ్య మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని కోనేటిపురంకు చెందిన వైసిపి సీనియర్ నాయకులు పడమటి అంజయ్య గుండె సంబంధిత సమస్యతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతి సమాచారాన్ని తెలుసుకున్న వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు ఆయన నివాసానికి శనివారం వెళ్లారు. అంజయ్య మృతదేహానికి పూలమాలతో నివాళి అర్పించారు. మృతు నికి భార్య, ఇరువురు కుమారుడు ఉన్నారు. మొదటి నుండి కాంగ్రెస్ సభ్యునిగా ఉన్న అంజయ్య వైఎస్ఆర్ మరణానంతరం వైసీపీలో చేరారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అశోక్ బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పడమటి శ్రీనివాసరావు, మాజీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపీపీ డివి లలిత కుమారి, ఎంపీటీసీ కౌతరపు పద్మావతి, కుందేటి రమేష్, కౌతరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - మేదరమెట్ల

గత నెలలో మేదరమెట్ల, తిమ్మనపాలెం గ్రామాల్లో ఒంగోలు, కొనకనమెట్ల మండలాల్లో మహిళలను బైకులపై వెంబడిస్తూ మహిళల మెడలోని బంగారు గొలుసులు లాక్కెళ్లే దొంగలను మేదరమెట్ల పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా చీరాల డిఎస్పి మహ్మద్ మొయిన్ మాట్లాడుతూ కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన దర్శనాల ఏడుకొండలు, షేక్ అఫీద్‌ను అరెస్టు చేసినట్లు వివరాలు వెల్లడించారు. ఇద్దరు స్నేహితులని అన్నారు. ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన వారై ఉండగా విలాసవంతమైన జీవితంతో పాటు బెట్టింగులు, చెడు వ్యసనాలకు బానిసలై ఖర్చుల కోసం వివిధ ప్రదేశాల్లో తిరుగుతూ చైన్ స్నా చింగ్‌కు పాల్పడ్డారని తెలిపారు. ఈనెల 19న సేకరించిన సమాచారం మేరకు మేదరమెట్ల గ్రామం వై జంక్షన్ దగ్గరలో ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసి వారి వద్ద నుండి 126 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు పచ్చ, నలుపు రంగులతో గల యమహా బైకులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముద్దాయిలను న్యాయస్థానం ముందు హాజరు పర్చనున్నట్లు తెలిపారు. తక్కువ సమయంలో దొంగలను పట్టుకోవడానికి సహకరించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ తుషార్ డ్యూటీ అభినందించారు. దొంగలను పట్టుకోవడంలో అద్దంకి రూరల్ సీఐ డి మల్లికార్జునరావు, మేదరమెట్ల, కోరిసపాడు ఎస్ఐలు ఎస్‌కె మహమ్మద్ రఫీ, సురేష్, బి వినోద్ బాబుతోపాటు బాపట్ల ఐటి కోర్ ఎస్ఐ ఎస్‌కె నాయబ్ రసూల్, కానిస్టేబుల్స్ కె తిరుపాలురెడ్డి, జి సురేష్, ఎన్ రమేష్ బాబును ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన సిబ్బందికి పారితోషకం ఇచ్చారు.



మాట్లాడుతున్న చీరాల డిఎస్‌పి మహ్మద్ మొయిన్



పాల్ హారీస్ జయంతిలో పాల్గొన్న నాయకులు

పాల్‌హారిస్‌కు నివాళి

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ వ్యవస్థాపకులైన పాల్ హారిస్ 157వ జయంతి సందర్భంగా పాల్ హారీస్ చిత్రపటానికి పూల మాల వేసి శనివారం ఘనంగా నివాళి అర్పించారు. ఆయన చేసిన సేవలు కొనియాడారు. విద్వాన్ జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ 1905లో అమెరికాలో ఆయన నలుగురు సభ్యులతో స్థాపించిన రోటరీ విశ్వ వ్యాప్తంగా 200 దేశాల్లో విస్తరించి ఎన్నో సేవలు చేస్తున్నదని అన్నారు. ప్రత్యేకించి పోలియో నిర్మూలనలో ప్రముఖ పాత్ర పోషించినదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, ఎజి షేక్ మహమ్మద్ రఫీ, చిన్ని మురళీ కృష్ణ, డాక్టర్ దేవపాలన, మన్నం త్రిమూర్తులు, తాళ్లూరి బాబురావు, గురుశేఖర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఆదివారం 20 ఏప్రిల్ 2025

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి



మహిళలను ఆశీర్వదిస్తున్న ఎంఎల్‌ఎ ఆనందబాబు

ప్రజాశక్తి - వేమూరు

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేసే పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సూచించారు. అమర్తలూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వివిధ సెక్టార్‌ల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన ఆహార పదార్థాలను ఆయన పరిశీలించారు. రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోషణ పక్వాడా పక్షోత్సవాలు ఏప్రిల్ 8 నుండి 22వరకు జరుగుతున్నట్లు తెలిపారు. మొదటి వెయ్యి రోజులు సంరక్షణ పై శ్రద్ధ వహించుటం, లబ్ధిదారులు స్వయంగా తమంతట తామే పోషణ ట్రాకర్‌లో నమోదు చేసుకునే విధానంపై అవగాహన కల్పిస్తున్నట్లు సిడిపిఓ ఆనందబాబుకు వివరించారు. కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ అమలు చేయడం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపం నివారించ వచ్చని అన్నారు. పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకుకోవాలని చెప్పారు. అనంతరం పలువురు గర్భిణీ మహిళలకు సీమంతాలు నిర్వహించారు. అనేకమంది చిన్నారులకు అన్నప్రసన చేశారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. పోతుమర్రు నుండి జంపని రోడ్డు విద్యుదీకరణ పనుల ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు ఎసిడిపిఓ విజయరాణి, తహశీల్దారు సుశీల, ఎంపీడీఓ, సూపర్వైజర్లు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రేపల్లె : గర్భవతులు, బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలని టిడిపి నాయకులు అనగాని శివప్రసాద్ అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా శనివారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలపై మరింత అవగహన కలిగి ఉండాలని చెప్పారు. పోషణ లోప దిష్టి బొమ్మను ఆర్‌డిఒ రామలక్ష్మి చేతుల మీదుగా దహనం చేశారు. పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారం ఆవశ్యకత వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన వంటకాల తయారీ విధానం, రాగిపిండితో వివిధ రకాల వంటల తయారీ, వాటిలోని పోషకాలు గురించి విపులంగా వివరించారు. కార్యక్రమంలో తహశీల్దారు ఎం శ్రీనివాసరావు, ఎంపిడిఒ శోభారాణి, ఎస్ఐ రాజశేఖర్, రూరల్ సీఐ సురేష్ బాబు, వెలుగు ప్రాజెక్టు ఎపిఎం గోపి, సిడిపిఓ ఎం సుచిత్ర, సూపర్వైజర్లు మంజుల, నాంచారమ్మ, రజని, వెంకటరత్నం, శివ జ్యోతి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

చెరుకుపల్లి : పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా ముందుగానే గుర్తించాలని నల్లపట్ల సిడిపిఓ అనసూయ అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వెయ్యి రోజుల సంరక్షణ కార్యక్రమాన్ని వివరించారు. ఊబకాయం వలన పిల్లల్లో వచ్చే సమస్య గురించి తల్లులకు అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహార పదార్థాల వంటకాలు చేయించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా గర్భవతులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దారు సిహెచ్ పద్మావతి, ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని, జడ్పిటిసి మర్రివాడ పావని, రేపల్లె డిఎల్పిఒ, ఈఒపీఆర్డి కెజెవి శ్రీనివాసన్, ఎపిఎం త్యాగరాజు పాల్గొన్నారు.



పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ రామలక్ష్మి



చెరుకుపల్లిలో పౌష్టికాహార పక్షోత్సవాలు

పరిసరాల శుభ్రతతోనే మానవాళి మనుగడ



వివేకనంద కాలనీలో పాల్గొన్న ఎంఎల్‌ఎ నరేంద్రవర్మ



యద్దనపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - బాపట్ల

పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిరంతరం కొనసాగాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. పట్టణంలోని వివేకానంద కాలనీలో అధికారులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజలు ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛమైన వాతావరణంలో జీవనం సాగిస్తే రోగాల బారిన పడే అవకాశం ఉండదన్నారు. కాలనీలో పరిసరాల పరిశుభ్రత పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో బొంతు శివసాంబిరెడ్డి, ఆర్డిఓ పి గ్లోరియా, బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, తహశీల్దారు సలీమా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కారంచేడు : స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా మండలంలోని 14 పంచాయతీల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు, ఐటి ఇన్ఫర్మేషన్, టేబుళ్లను అధికారులు శుభ్రపరిచారు. కార్యక్రమంలో ఎఒ కె సుధీర్ బాబు, ఎపిఎం మోహనరావు, సర్పంచి బాలిగ శివ పార్వతి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

భట్టిప్రోలు : ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలు సరైన విధానంలో రీసైక్లింగ్ చేసుకోవాలని ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ సూచించారు. ప్రతి నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ, డిప్యూటీ ఎంపిడిఒ టి ఊహారాణి, ఎఒ జలజ, ఎపిఎం జి శ్రీమన్నారాయణ, పంచాయతీ రాజ్ ఎఇ రామచంద్రారావు, ఎపిఒ శివపార్వతి, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ శివకృష్ణ పాల్గొన్నారు.

అమృతలూరు : పరిసరాల పరిశుభ్రత పాటించి పచ్చదనాన్ని కాపాడాలని ఎంపిడిఒ శేషమాంబ సూచించారు. యలవర్రులో శనివారం స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా ర్యాలీ నిర్వహించారు. తహశీల్దారు నెహ్రూ బాబు, ఈఒపీఆర్డి రవిశంకర్ పాల్గొన్నారు.

యద్దనపూడి : స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమం మండల స్పెషల్ ఆఫీసర్ ప్రకాశరావు, డిప్యూటీ ఎంపిడిఒ టివి కృష్ణ ఆధ్వర్యంలో పూనూరు గ్రామంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పూనూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎఎం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సాంబశివరావు, వింజనంపాడు ఉప సర్పంచ్ రంగారావు పాల్గొన్నారు.

బాపట్ల : ఆసుపత్రుల్లో ఈ-వేస్ట్ ఉత్పత్తి తగ్గించుకోవడంతోపాటు డ్రై వేస్ట్, వెట్ వేస్ట్ వ్యర్థాలుగా విడదీసి రీ సైక్లింగ్ కేంద్రాలకు తరలించాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా శనివారం ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర నోడల్ ఆఫీసర్ లోకేష్ పాల్గొన్నారు.

పర్చూరు : పరిసరాలు ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్ పేర్కొన్నారు. సర్పంచ్ అంజమ్మ, పంచాయతీ కార్యదర్శి మస్తానరావు, ఎపిఎం రామకృష్ణ, ఎపిఒ రమేష్, డిటి సుధారాణి, విఆర్‌ఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపల్లె : పట్టణాల్లో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కేంద్రాన్ని ఆర్‌డిఒ ఎన్ రామలక్ష్మి శనివారం ప్రారంభించారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్రలో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మానవ హారంగా ఏర్పడి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కమిషనర్ కె సాంబశివ రావు, మునిసిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ, తహశీల్దారు ఎం శ్రీనివాసరావు, శానిటరి ఇన్స్‌పెక్టర్ ఎ రామచంద్రరావు, జనసేన పట్టణ అధ్యక్షులు ఆర్ మహేష్, బిజెపి పట్టణ అధ్యక్షులు వి శివరామ్ ప్రసాద్ పాల్గొన్నారు.



భట్టిప్రోలులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రతినిధులు



ఈ వేస్ట్ సేకరణ కౌంటర్ ప్రారంభిస్తున్న ఆర్డీఓ రామలక్ష్మి



పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న డిఎంహెచ్‌ఒ విజయమ్మ

హాస్పటల్లో కాన్పులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - వేటపాలెం

ప్రభుత్వ హాస్పటళ్లలో డెలివరీలు ప్రోత్సహించే విధంగా సిబ్బంది పనిచేయాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ విజయమ్మ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కొత్తపేట పంచాయతీ గోపాల్‌నగర్లోని అంగన్‌వాడి సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాధి నిరోధక టీకాలు ఎంత మందికి వేశారనే రికార్డులు పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పౌష్టిక ఆహారాన్ని ఆమె పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా అందించే పౌష్టిక ఆహారం గురించి విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ప్రస్తుత వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సూపర్వైజర్లు శరత్, శేషు బాబు, సిహెచ్‌ఒ అనుపమ, ఎంపిహెచ్‌ఎ ఫిమేల్ రుక్మిణి, ఆశా కార్యకర్త నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త షేక్ నిర్మల పాల్గొన్నారు.



తహశీల్దారుకు అర్జీ ఇస్తున్న ముస్లిము ఎద్దలు

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ర్యాలీ

ప్రజాశక్తి - సంతమాగులూరు

వక్ఫ్ బోర్డ్ అధికారాలు నిర్వీర్యం చేసే లా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ ప్రజల జేఏసీ ఆధ్వర్యంలో మండలంలోని పుట్టావారిపాలెం అడ్డరోడ్డు జంక్షన్ నుండి సంతమాగులూరు వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయం వద్ద తహశీల్దారు కె రవిబాబుకు వినతి పత్రం అందజేశారు. ర్యాలీని ఉద్దేశించి పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ చట్ట సవరణను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో 9.04లక్షల ఎకరాల భూములు కలిగి, ఏడాదికి రూ.8.04లక్షల ఆదాయం వచ్చే సంపదను ముస్లిం ఆధ్యాత్మిక అవసరాలు, మదర్సాలు, పేద ముస్లిం కుటుంబాల అవసరాలకు ఉపయోగించు కుంటున్నారని అన్నారు. నరేంద్ర మోది ప్రధాని అయిన తర్వాత వక్ఫ్ భూములు రద్దు చేయాలని ప్రతిపాదించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ చట్టం వలన ముస్లింలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న పార్టీలు పునారాలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంసిపిఐ పల్నాడు జిల్లా నాయకులు షేక్ మొహిద్దీన్ భాష, కెఎన్‌పిఎస్ నాయకులు ఓ శ్రీనివాసరావు, ముస్లిం సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - చెరుకుపల్లి



ఐ నరసింహమూర్తి

పాఠశాలకు బయలుదేరిన ఉపాధ్యాయుడు మార్గం మధ్యలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. మండలంలోని గుల్లపల్లికి చెందిన ఐనంపూడి నరసింహమూర్తి ఉమ్మడి గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలంలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. పాఠశాలకు వెళ్లేందుకు శనివారం తెల్లవారు జామున స్వగ్రామం నుండి నిడుబ్రోలులో శబరి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కేందుకు నిడుబ్రోలుకు బైకుపై వెళుతూ మార్గమధ్యంలో అమర్తలూరు మండలం ఇంటూరు గ్రామ సమీపంలో పంట కాలవ వద్ద అదుపుతప్పి కాలవలోకి దూసుకుపోయాడు. ఆ సమయంలో అటు నుంచి వస్తున్న గడ్డి ట్రాక్టర్, కారు డ్రైవర్లు నరసింహమూర్తిని బయటికి తీయగా అప్పటికే ఆయన చనిపోయినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అమర్తలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో పరిశీలిస్తున్న ఎస్ఐ అనీల్ కుమార్

మద్యం దుకాణంలో చోరీ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని రాంబొట్లపాలెంలోని కనకదుర్గ వైన్స్ షాపులో చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు షాపులోని రూ.3.6లక్షల నగదు అపహరించుకెళ్లారని షాపు నిర్వాహకులు పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్నారు. శనివారం తెల్లవారు జామున ఇరువురు దుండగులు తాళాలు పగలగొట్టి కౌంటర్లోని నగదు చోరీ చేసినట్లు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. మండలంలోని గుల్లపల్లిలో కూడా శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఇంటిలోని వెండి, ఇతర విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు యజమాని ఫిర్యాదు చేశారు.

'స్వచ్ఛత'లో భాగస్వాములు కావాలి

ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జి అధికారి ఎన్.సురేష్ కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్వచ్ఛత కార్యక్రమంలో 15వ స్థానంలో ఉన్న ఒంగోలు కార్పోరేషన్ ను మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని జిల్లా ఇన్‌ఛార్జి అధికారి, మున్సిపల్ పరిపాలన, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ తెలిపారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఒంగోలు పివిఆర్ హై స్కూల్ నుంచి కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న ఈ వ్యర్థాల సేకరణ కేంద్రం వరకూ శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సురేష్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు, నగర మేయర్ గంగాడ సుజాత, ఎపి పర్యటక అభివద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు.తొలుత కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన ఈ వ్యర్థాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. అనంతరం షాదీఖానాలో ఈ వ్యర్థాల నిర్వహణ పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి సురేష్ కుమార్ మాట్లాడుతూ పరిశుభ్రత ఒక రోజుతో వచ్చేది కాదని తెలిపారు. అది జీవితంలో ఓ భాగం కావాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వచ్ఛ ఆంధ్ర 2047 విజన్ డాకుమెంట్‌ను తీసుకొచ్చినప్పుడు 10 సూత్రాలలో స్వచ్ఛత అనే అంశాన్ని 9వ సూత్రంగా నిర్ణయించారన్నారు. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడవ శనివారం ఒక్కొక్క నెల ఒక్కొక్క థీమ్ తో స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు ఎలక్ట్రానిక్స్ వినియోగం రోజు రోజుకు పెరుగుతున్న తరుణంలో ఈ వేస్టు పెద్ద సమస్యగా మారుతుందన్నారు. నిరుపయోగంగా వున్న ఈ వ్యర్థాలను సురక్షితంగా రీ సైక్లింగ్ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించినట్లు తెలిపారు. చఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి అధికారి సురేష్ కుమార్

బర్లీ పొగాకు రైతుల ఆక్రందన

బర్లీ పొగాకు సాగు చేసిన రైతుల ఆక్రందనలు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చెవికెక్కడం లేదు. మద్దతు కల్పించడం, కొనుగోళ్ళు జరిగేలా చూడాల్సిన నేతలు, అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వేలాది ఎకరాల్లో బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ధర్నాలు, రాస్తారాకోలు చేసినా ఫలితం లేకుండా పోయింది. పొగాకు సాగు చేయండి మేము మీ పొగాకును కొంటామని చెప్పిన ప్రైవేట్ కంపెనీలు అడ్రస్సు లేకుండా పోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట సాగుకు తెచ్చిన అప్పులు తీరే దారి లేక రైతులు అప్పుల ఊబి లో కూరుకుపోతున్నారు. భారీ గాలులు, అకాల వర్షాలు రైతులను నష్టాలపాలు చేస్తున్నాయి. బాపట్ల జిల్లాలో ఇటుకల పరిశ్రమకు నష్టం వాటిల్లింది. మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిన్నాయి. కొద్దిమేర మినుము, పెసర పంటలకూ నష్టం వాటిల్లింది. పొగాకు మిర్చి, పొగాకు తాళ్లు కల్లాలో తడిచాయి. పొలంలో ఆరబెట్టిన పొగాకు తాళ్లు తడవడంతో నాణ్యత తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకాశం జిల్లాలో అకాల వర్షాలకు బొప్పాయి తోటలు దెబ్బ తిన్నాయి. గాలులకు లేత మామిడికాయలు రాలిపోయాయి. అధికారులు పంట నష్టం అంచనాల్ను రూపొందించి రైతులను ఆదుకోవాల్సిఉంది.

అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించిన అక్రమార్కులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టులు చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వాధికారుల్లో అవినీతి పెచ్చుమీరుతూనే ఉంది. ఏపని చేయాలన్నా నగదు డిమాండ్ చేస్తున్నారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు తహశీల్దారు సుజన్ కుమార్, విఆర్ఒ అంకమ్మరావులు మరణ ధ్రువీకరణ పత్రం జారీ కోసం రూ.90 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. మద్దిపాడు మండల దొడ్డవరం గ్రామానికి చెందిన అంకమ్మరావు తన భార్య చనిపోవడంతో డెత్ సర్టిఫికెట్ కోసం తహశీల్దారు సంప్రదించాడు. అందుకోసం తహశీల్దారు రూ.90 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడు నగదును విఆర్ఒ అంకమ్మరావుకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తహశీల్దారు సుజన్ కుమార్ ఆ నగదు తీసుకోవాలని చెప్పడంతో తాను తీసుకున్నటు విఆర్ఒ తెలిపాడు

ఉచిత ఇసుక పాలసీ అమలు కావడం లేదు.రెండు జిల్లాల లోనూ ఉచిత ఇసుక అందుబాటు లేదు. కొందరు అధికారం అండగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. పేదలు ఇళ్లు కట్టుకునేందుకు ఉచిత ఇసుక దొర్కక అవస్థలు పడుతున్నారు.



మత్స్యకారులు వేట నిషేధకాల భృతి కోసం ఎదురుచూస్తున్నారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకూ సముద్రంలో వేట నిషేధం అమలు చేస్తున్నారు. ఈ సమయంలో తల్లి చేపలు, తల్లి రొయ్యలు సంతాన ఉత్పత్తి ప్రక్రియ జరుగుతుంది. దీంతో ఆకాలంలో సముద్రంలో వేట నిలుపుదల చేస్తారు. వేట నిలిచిన కాలానికి సంబంధించి ప్రభుత్వం గతంలో ఒక్కొక్క మత్స్యకారుడికి రూ.10 వేల వంతున భృతి చెల్లించేంది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక గతేడాది భృతి ఇవ్వలేదు. ఈ ఏడాది నుంచి రూ.20 వేలు ఇస్తామని ప్రకటించింది.

మైక్రో ఫైనాన్స్ కంపెనీల వేధింపులు ఎక్కువయ్యాయి. పేదలు, బలహీనవర్గాల వారి వెంటపడి రుణాలు ఇస్తున్నారు. తర్వాత రుణాల వసూలు కోసం తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వారిపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులు, ఫైనాన్స్ రికవరీ ఏజెంట్‌లపై పోలీసులు దృష్టి పెట్టారు. ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగులు చట్ట బద్ధంగా నిబంధనలను పాటించాలని చెబుతున్నారు. రుణగ్రహీతలను ఎలాంటి వేదింపులకు గురి చేయరాదని, కంపెనీ ద్వారా లీగల్ గా నోటీసుల అందజేసి కోర్టు జారీచేసే ఆదేశాల మేరకు నడుచుకోవాలని సూచించారు.

వక్ఫ్ బోర్డు అధికారాలను నిర్వీర్యం చేసేలా కేంద్రం తెచ్చిన సవరణ చట్టానికి వ్యతిరేకంగా ముస్లిములు నిరసన ప్రదర్శనలు చేపడుతున్నారు. ముస్లింల హక్కులు హరించటానికే వక్స్ బోడ్డు సవరణ చట్టం తెచ్చారని ఆరోపిస్తున్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రదూ చేసే వరకూ పోరాటం కొనసాగిమని చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముస్లింల హక్కులు హరించేలా ఉన్న వక్ఫ్ చట్ట సవరణను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు ముస్లిముల పోరాటానికి మద్దుతు తెలుపుతున్నారు.

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఇతర రాష్ట్రాలకు ధీటుగా చీరాల బీచ్ అభివృద్ధి

బాపట్ల జిల్లా ప్రత్యేక అధికారి కతిక శుక్లా

ప్రజాశక్తి -వేటపాలెం, బాపట్ల జిల్లా

చీరాల ప్రాంతంలోని బీచ్‌లను రాబోయే రోజుల్లో ఇతర రాష్ట్రాలకు ధీటుగా పర్యాటక కేంద్రాలుగా అభివద్ధి చేయనున్నట్లు రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్, జిల్లా ప్రత్యేక అధికారి కతిక శుక్లా తెలిపారు. వేటపాలెం మండలం రామాపురం గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాపురం వద్ద బీచ్ క్లీనింగ్ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ప్రత్యేక అధికారి కతిక శుక్లా, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, చీరాల ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ చీరాల రామాపురం బీచ్‌లు రాబోయే రోజుల్లో మంచి పర్యాటక ప్రాంతంగా అభివద్ధి చెందుతుందన్నారు. పర్యాటకుల సౌకర్యం కోసం రహదారులు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. పర్యాటకులు సముద్ర స్నానాలు వెళ్ళినప్పుడు ప్రమాదాలు జరగకుండా రిసార్ట్స్ యజమానులు వారికి అవసరమైన సూచనలు ఇవ్వాలన్నారు. జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని అమలు చేయడానికి చర్యలు తీసుకుందన్నారు. రాష్ట్రంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటుందన్నారు. ఇంట్లో వాడే చెత్తను 3 రకాలుగా విభజించి తడిచెత్త, పొడిచెత్త, ప్రమాదకరమైన వ్యర్థ పదార్థాలను విభజించి గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీ సిబ్బందికి అందజేయాలన్నారు. పర్యాటకులు లోతుకు వెళ్లకుండా ప్లాగ్ లను ఏర్పాటు చేయాలన్నారు. బాపట్ల సూర్యలంక బీచ్ అభివద్ధి కోసం ప్రభుత్వం రూ.98 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రామాపురం బీచ్ అభివద్ధి కోసం రెండు కోట్లు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు.. బీచ్ ప్రాంతంలో విరివిగా మొక్కలు పెంచాలన్నారు. అందుకు రిసార్ట్స్ యాజమాన్యం సహకరించాలన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎం.మాల కొండయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారన్నారు. చీరాల నియోజకవర్గంలో బీచ్‌ను అభివద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, పారిశుద్ధ కార్మికులతో కలెక్టర్ స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జన్నేమ్మ, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగిరెడ్డి , చీరాల ఆర్‌డిఒ చంద్రశేఖర్, చీరాల తహశీల్దారు గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బీచ్‌ను శుభ్రం చేస్తున్న అధికారులు, ఎమ్మెల్యే కొండయ్య

దిగజారుతున్న పొగాకు ధరలు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

పొగాకు ధరలు నానాటికీ దిగజారుతున్నాయి. ప్రకాశం రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో శనివారం కిలో పొగాకు కనిష్ట ధర రూ. 215 పలికింది. గతో నెల నెలలో కిలో పొగాకుకు కనిష్ఠ ధర రూ. 230 లభించింది. ప్రస్తుతం కిలోకు రూ. 15 మేర తగ్గింది. గరిష్టధరలో ఎలాంటి మార్పు లేదు. వేలం ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకూ కిలో పొగాకు ధర రూ.280 మించి పెరగలేదు. మార్చి నెలాఖరు వరకూ కిలో పొగాకు సగటు ధర రూ.270 లభించింది. ఈ ధర గత వారం నుంచి రూ.230కి దిగజారింది. గతంలో కంటే 10 శాతం బేళ్లు అధనంగా తిరస్కరిస్తున్నారు. గత నెల 20 వరకూ 12 నుంచి 13 శాతం బేళ్లు తిరస్కరించారు. శనివారం బ్లాక్ సాయిల్, లైట్ సాయిల్ లోని వేలం కేంద్రాల్లో 21శాతం బేళ్ల తిరస్కరించారు. లైట్ సాయిల్ ప్రాంతాల్లోని వేలం కేంద్రాలైన పొదిలి, కనిగిరి, కందుకూరు, కలిగిరి, డిసిపల్లి వేలం కేంద్రాలకు మొత్తం 4, 319 బేళ్లు అమ్మకానికి వచ్చాయి. అందులో 2758 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణగాల చేత 805(21శాతం) తిరస్క రించారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ఠ ధర రూ.215, సగటు ధర రూ.256 పలికింది. బ్లాక్ సాయిల్ ప్రాంతాల్లోని వేలం కేంద్రాలైన వెల్లంపల్లి, ఒంగోలు –1,2 ,టంగుటూరు, కొండపి వేలం కేంద్రాలకు మొత్తం 3,070 పొగాకు బేళ్లు అమ్మకానికి వచ్చాయి. అందులో 2,220 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 665(21.66 శాతం) బేళ్లను తిరస్కరించారు.కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ఠ ధర రూ.220, సగటు ధర రూ.256 పలికింది.